క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



సి.బెళగల్ ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న గుడిపల్లె సురేందర్

సి.బెళగల్: హాస్టల్లో ఉండే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుడిపల్లె సురేందర్ సూచించారు. ఆదివారం స్థానిక సర్పంచ్ పాండురంగన్న, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలు, వంటగది, విద్యార్థుల గదులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతులు, భోజన సదుపాయాలు, ఇతర సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులు ప్రతిరోజూ స్నానం చేయాలని, భోజనానికి ముందు, తరువాత చేతులు కడుక్కోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్స్ చార్జీలను అధికారులతో మాట్లాడి విడుదల చేయించేందుకు కృషి చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు కేశవనాథ్, వెంకటేశ్వర్లు, ఎస్‌ఎంసీ చైర్మన్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు గ్రామంలో గడ్డివామి నిప్పంటుకుని దగ్ధమైంది. గ్రామస్తుడు ఓబులేసుకు చెందిన గడ్డివామికి ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో కాలిపోయింది. సమాచారం అందుకున్న నంద్యాల అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇటీవల రూ.80 వేలతో పశుగ్రాసం కొని వామి వేసుకున్నట్లు రైతు తెలిపారు. నిప్పంటుకోవడంతో గ్రాసం మొత్తం కాలిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

పూడిక తీసి వదిలేశారు!



హెడ్ పోస్టాఫీసు వద్ద డ్రైనేజీలోని పూడిక, మట్టిని తవ్వి రోడ్డుపై వేసిన దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): పాత బస్టాండులోని హెడ్ పోస్టాఫీసు వద్ద విద్యుత్ స్తంభాల మార్పు కోసం డ్రైనేజీలో పూడిక, మట్టిని తవ్వి వదిలేశారు. వారం రోజులవుతున్నా పనులు పూర్తి చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు వాహనాల రాకపోకలు సాగుతుండగా పాదచారులు నడుచుకుంటూ వెళ్లాలంటే ఎక్కడ బురద మట్టిలో పడిపోతామేమోనని ఆందోళనకు గురవుతున్నారు. కర్నూలుకు తలమానికమైన కొండారెడ్డి బురుజు వద్ద మురుగునీటి కాల్వలో పూడికను తీసి వదిలేయడంతో కంపుకొడుతోంది. పనులు పూర్తి చేయకపోవడంతో 'ఇదేనా స్మార్ట్ సిటీ' అని పాదచారులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ, విద్యుత్ శాఖ అధికారులు త్వరిగతిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

నాటు సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌తో ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో నాటుసారాను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు కర్నూలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రహాస్ తెలిపారు. ఉలిందకొండ గ్రామానికి చెందిన గొల్ల రమేష్, కొల్లంపల్లి తాండకు చెందిన తెలుగు రామాదాసు నాటుసారాను తీసుకొని బజాజ్ ద్విచక్రవాహనంపై గార్గేయపురం గ్రామానికి తీసుకపోయారు. ఆ గ్రామానికి చెందిన బైనేని సురేష్ ఇంటి ముందు బైక్‌పై నుంచి నాటు సారాను దింపుతుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. గొల్ల రమేష్, బైనేని సురేష్‌లను పట్టుకోగా, తెలుగు రామదాసు ఎక్సైజ్ పోలీసులను చూసి పారిపోయారు. డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కర్నూలు ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు నాటు సారా విక్రయించేవారిని తమకు వచ్చిన సమాచారం మేరకు చేసిన దాడుల్లో 40 లీటర్ల నాటు సారా, బైక్‌ను స్వాధీనం చేసుకొని పట్టుబడిన ఇద్దరు, పారిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రహాస్ తెలిపారు. పారిపోయిన వ్యక్తిని సైతం త్వరలోనే అరెస్ట్ చేస్తామని, ఈ దాడుల్లో పాల్గొన్న సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నవీన్ బాబు, కానిస్టేబుల్స్ ఈరన్న, మధు, సూర్యనారాయణ, ఎం.రాజు, సుదర్శన్, రాజులు పాల్గొన్నారని ఆయన వెల్లడించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం



'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి



హాజరైన కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి
- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి
- కార్యకర్తలను విస్మరించే ప్రసక్తే లేదు
- ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

కల్లూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గ్రామ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కల్లూరు గ్రామీణ, కల్లూరు అర్బన్ వార్డుల మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. పార్టీలో రాష్ట్ర, జిల్లా, మండల విభాగాల్లో పదవులు పొందిన వారు, అర్బన్ 16 వార్డులు, గ్రామీణ మండలం ప్రాంతం నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని కాటసాని స్పష్టం చేశారు. గోరుకల్లు రిజర్వాయర్‌ను టీడీపీ నాయకులు తీసుకొచ్చినట్లు చెప్పుకుంటున్నారని, ఎవరి కాలంలో ప్రాజెక్టు శంకుస్థాపన జరిగిందో, ఎవరు ప్రారంభించారో ఇరిగేషన్ శాఖ రికార్డులను పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. వైఎస్సార్ హయాంలోనే గోరుకల్లు, హంద్రీనీవా, గాలేరు నగరి, ఎస్‌ఆర్‌బీసీ, గోరుకల్లు రిజర్వాయర్ ప్రాజక్టులను తీసుకొచ్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గోరుకల్లు రిజర్వాయర్‌కు గేట్లు ఏర్పాటు చేసి, 11 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో గత ఐదేళ్ల రైతులకు సాగు, తాగునీరు అందించామన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

ఎన్నికల సమయంలో అలవిగాని హామీలు ఇచ్చి సీఎం చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దామన్నారు. ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ప్రతి కుటుంబం ఎంత నష్టపోయిందో ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి 'బాబు ష్యూరిటీ – భవిష్యత్ గ్యారెంటీ' అని బాండ్లు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగాలు వచ్చే వరకు భృతి ఇస్తామని, రైతులకు అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి వంటి పథకాలు ఇస్తామని ప్రగాల్భాలు పలికారని గుర్తు చేశారు. పొదుపు మహిళలకు రూ.10 లక్షలు బ్యాంకు లోన్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు.

స్థానిక ఎన్నికలపై దృష్టి

రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చూపుదామని కాటసాని శివనరసింహారెడ్డి అన్నారు. నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాస్తున్నారని వాటికి భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వ హామీలపై ప్రజల తరపున పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ రేణుక, కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు తీసుకుంటున్న ఫకృద్దీన్

కర్నూలు(రూరల్): గార్గేయపురం ప్రాథమిక వ్యవసాయ సహకర పరపతి సంఘం చైర్మన్‌గా ఫకృద్దీన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు డైరెక్టర్లుగా జంబులయ్య, దిగువపాడు లక్ష్మిరెడ్డి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ.. సుమారు 1,896 మంది సభ్యులు ఉన్న సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలకు కృషి చేస్తామన్నారు. సభ్యులు కూడా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. సహకర పరపతి సంఘం సీఈఓ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు హాజరుకాకుంటే చర్యలు

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువతను మోసగించిన కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న సూర్యనారాయణరెడ్డి

పాణ్యం: యువతకు ఇచ్చిన హామీలు అమలుచేయకుండా కూటమి ప్రభుత్వం వారిని నట్టేట ముంచిందని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం ఓ ప్రైవేటు పాఠశాలలో పాణ్యంకు చెందిన సుమారు 200 మంది యువకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నిరుద్యోగులకు ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. నిరుద్యోగ భృతి ఊసేలేదని, దీంతో లక్షలాది మంది నిరుద్యోగులు ఉపాధి లేక అల్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు సచివాలయ ఉద్యోగాలు, వలంటీర్లు, ఇతర ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. పరిశ్రమల్లో స్థానికులకు 70 శాతం ఉపాధి అవకాశాలు కల్పించేలా జీఓ తెచ్చారన్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై యువకులు మేల్కొనాలని పిలుపునిచ్చారు. పాణ్యంలోని ముస్లింపేటకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు నాయకుల విధానాలు నచ్చక వైఎస్సార్‌సీపీ సమావేశానికి హాజరయ్యారన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, కొండజూటూరు సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి, వడ్డుగండ్ల రాముడు, బాబి, యువకులు పాల్గొన్నారు.

ఈగలు ముసిరి.. రోగాలు ప్రబలి



కర్నూలు అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎదురుగా చెత్తచెదారంతో నిండిన కాల్వ



వడ్డెగేరిలో నడిరోడ్డుపై వేసిన చెత్తచెదారం, మాంసం వ్యర్థాలు



కింగ్‌మార్కెట్‌లో కుళ్లిపోయిన మామిడిపండ్లను రోడ్డుపై వేసిన దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగరంలోని పలు కాలనీల డ్రైనేజీల్లో చెత్తచెదారం, వ్యర్థాలు పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. అసలే వర్షాకాలం ఆపై ఈగలు ముసిరి.. రోగాలు ప్రబలే ప్రమాదం ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కర్నూలు అర్బన్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎదురుగా ఉన్న కాల్వ చెత్తచెదారం, వ్యర్థాలతో నిండిపోయి మురుగునీరు పారకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే సమీపంలోని సీపీఎం కార్యాలయం వెనుక భాగంలో మురుగునీటి కాల్వలో చెత్తచెదారం వేయడంతో కాల్వ వ్యర్థాలతో నిండిపోయింది. అదే ప్రాంతంలో ఎక్కడబడితే అక్కడ మలమూత్ర విసర్జన చేయడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. వడ్డెగేరిలో చెత్తచెదారం, మాసం వ్యర్థాలు, కుళ్లిన కూరగాయలు పడేయడంతో ఈగలు, దోమలు ముసురుకున్నాయి. దీంతో రోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

యూరియా అధిక ధరలకు అమ్మితే చర్యలు

సి.బెళగల్: మండలంలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని గ్రామ రైతు సేవా కేంద్రాలు, ఎరువు మందుల డీలర్ల వద్ద ప్రస్తుతం 238 టన్నుల (5,192 బస్తాల) యూరియా నిల్వ ఉందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా యూరియాను అధిక ధరలకు అమ్ముతున్నట్లు గుర్తించినట్లయితే సంబంధిత అధికారులకు లేదా వ్యవసాయ విభాగానికి ఫిర్యాదు చేయాలని కోరారు.

ఆస్తిలో వాటా ఇవ్వలేదని ఆత్మహత్య

కర్నూలు రూరల్: తండ్రి ఆస్తిలో తనకు వచ్చే వాటా ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. తాలూకా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగలపాడుకు చెందిన సుజ్ఞానానికి ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య చనిపోయిన తరువాత సుజ్ఞానం రెండో వివాహం చేసుకున్నారు. మొదటి భార్యకు ఒక కుమారుడు సురేష్ ఉన్నారు. రెండో భార్యకు కుమారుడు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. తల్లి చనిపోయిన తరువాత తండ్రి దగ్గరే పెరిగిన సురేష్ తెలంగాణ రాష్ట్రంలోని ఓ ప్రైవేటు బ్యాంకు ఫైనాన్స్‌లో ఉద్యోగిగా పని చేస్తున్నారు. జోగులాంబ గద్వాలకు చెందిన గీతను సురేష్ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటు కుటుంబ పోషణ భారం కావడంతో తండ్రి ఆస్తిలో తనకు వాటాగా వచ్చే ఆస్తిని ఇవ్వాలని కోరగా.. అందుకు తండ్రి అంగీకరించకపోవడంతో మనస్తాపం చెందిన తన చావుకు కారణం తన తండ్రేనని, తనకు వాటాగా రావాల్సిన ఆస్తి ఇవ్వడం లేదని లేఖ రాసి శనివారం ఇంటి దగ్గరే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు పెద్దసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సురేష్ (39) చనిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నరేష్ తెలిపారు.

పేరుకుపోయిన గుర్రపు డెక్క



బ్రిడ్జి వద్ద అడ్డుపడ్డ గుర్రపు డెక్క

మండల పరిధిలోని తొగర్చేడు గ్రామానికి ముందు కుందూ నదిపై ఉన్న బ్రిడ్జి వద్ద గుర్రపు డెక్క పేరుకుపోయింది. నంద్యాల, ఆత్మకూరు, తదితర ప్రాంతాల నుంచి కుందూలో ఉన్న గుర్రపు డెక్క ఆకు నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చి బ్రిడ్జి వద్ద ఆగింది. ఇటీవలే కుందూకు నీటిని విడుదల చేయడంతో ఆకు పెద్ద ఎత్తున బ్రిడ్జి వద్ద అడ్డుపడినట్లు గ్రామస్తులు తెలిపారు. గుర్రపు డెక్కను తొలగించకుంటే బ్రిడ్జికి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ గుర్రపు డెక్క ఆకు క్రమంగా పెరుగుతున్నట్లు తెలిపారు. అధికారులు మిషన్ల సాయంతో గుర్రపు డెక్కను తొలగించాలని కోరుతున్నారు. లేని పక్షంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడే ముప్పు ఉందని వాపోయారు. –పాణ్యం

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



నన్నూరులో ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు



శకునాలలో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు, శకునాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో పండుగ వాతావరణం నెలకొంది. నన్నూరులో జరిగిన వేడుకలకు ఎంపీపీ తిప్పన్న, శకునాలలో హెచ్‌ఎం సునీత అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పెంచి పోషిస్తే, గురువులు క్రమశిక్షణ, భవిష్యత్‌కు పునాదులు వేస్తారని చెప్పారు. గురువులు నేర్పిన అడుగు జాడల్లో నడుచుకోవడం వల్ల భవిష్యత్తులో ఉన్నత స్థానాలలో రాణించగలరని చెప్పారు. శకునాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో హెచ్‌ఎం సునీత మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం పాఠాలు నేర్చుకొన్న విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకోవడం జీవితంలో మరువలేని రోజని అభిప్రాయపడ్డారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని సంతోషంగా గడిపారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు (టౌన్): రౌడీషీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. కర్నూలు నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లలో నేర చరిత్ర కలిగిన వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు, రౌడీ షీటర్లకు ఆదివారం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతన్నకు సాయమేది?

- అన్నదాతను ఆదుకోని కూటమి ప్రభుత్వం
- గతేడాది తీవ్ర నష్టాలతో సతమతం
- నేటికీ రైతులకు పరిహారం అందని వైనం
- ఖరీఫ్ ప్రారంభమైనా రైతు భరోసా ఊసే లేదు



కోడుమూరులో ఖరీఫ్‌లో సాగైన పత్తి పంట

కోడుమూరు రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చింది మొదలు రైతులకు కష్టాలు మొదలయ్యాయి. పంటల సాగుకు అవసరమయ్యే పెట్టుబడి కోసం ఇచ్చే రైతు భరోసాను కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా అదిగో ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తుందే తప్ప ఇంత వరకు నయాపైసాను రైతులకు ఇవ్వలేదు. అలాగే రైతులు సాగు చేసే పంటలకిచ్చే ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం పూర్తిగా మంగళం పాడింది. దీంతో రైతులే స్వయంగా తాము సాగు చేసిన పంటలకు డబ్బులు కట్టి పంటల బీమా చేయించుకోవాల్సిన దుస్థితి దాపురించింది. అలాగే పండించిన పంటలకు కల్పించే గిట్టుబాటు ధర కూడా మార్కెట్‌తో సమానంగా ప్రభుత్వం ఇస్తుండడంతో రైతులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు.

గత ప్రభుత్వంలో భరోసా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు వ్యవసాయంలో వెన్నుదన్నుగా నిలిచింది. పంటల సాగుకు పెట్టుబడి సాయంగా రైతు భరోసానిచ్చింది. అలాగే రైతులు సాగు చేసిన పంటలకు ఉచిత పంటల బీమా, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఎన్నో రకాలుగా ఆదుకుంది. అతివృష్టి, అనావృష్టి వల్ల సాగు చేసిన పంటలు దెబ్బతింటే నష్టపోయిన ప్రతి రైతుకు నేరుగా రైతుల ఖాతాల్లో పంట నష్టపరిహారాన్ని అందించి అండగా నిలిచింది.

జమ కాని పంట నష్టపరిహారం

గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో అతివృష్టి అనావృష్టితో సాగు చేసిన పంటలన్నీ దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా రబీ సీజన్‌లో శనగ, జొన్న వంటి పంటలు సాగు చేసిన రైతులకు కనీసం పెట్టుబడులు కూడా దక్కలేదు. దీంతో కూటమి ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకుందే తప్ప ఇంత వరకు పైసా పరిహారాన్ని కూడా జమచేయలేదు. జగనన్న పాలనలో ఏ సీజన్‌లో పంటలు నష్టపోతే ఆ సీజన్ ముగిసే నాటికే పంట నష్టపరిహారం డబ్బులను రైతన్నల ఖాతాలో జమచేసేవారు. కూటమి ప్రభుత్వం మాత్రం పరిహారం డబ్బులను చెల్లించకుండా రైతులను మానసికంగా వేధిస్తోంది.

రైతు భరోసా ఊసే ఎత్తని ప్రభుత్వం

ఎన్నికల ముందు సూపర్‌సిక్స్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' కింద రైతన్నకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామని ప్రకటించింది. అయితే కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రైతన్నకు ఎలాంటి సాయాన్ని అందించలేదు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులవుతున్నా లబ్ధిదారుల ఎంపిక పేరుతో కాలయాపన చేస్తుందే తప్ప కచ్చితంగా ఎప్పుడు ఇస్తారో చెప్పకపోవడంతో రైతులు పంటల పెట్టుబడుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడులకు డబ్బులు లేక రైతులు స్థానికంగా ఉన్న వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమకు అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం డబ్బులను వెంటనే చెల్లించాలంటూ రైతులు కోరుతున్నారు.

అరకొర వానలతో ఆందోళన

ఖరీఫ్ ప్రారంభానికే ముందే భారీ వర్షాలు కురవడంతో ఈ ఏడాది రైతులంతా ఖరీఫ్‌పై ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు పరిధిలో 33వేలకు పైగా హెక్టార్లలో పత్తి, కంది వంటి పంటలను సాగు చేశారు. అయితే ముందస్తుగా కురిసిన వానలు తప్ప మళ్లీ భారీ వర్షాలు పడకపోవడం, కురిసినా అరకొర వర్షాలతో ఖరీఫ్ సీజన్ చురుకుగా ముందుకు సాగడం లేదు. కొన్ని గ్రామాల్లో మొదట కురిసిన వానలు తప్ప మళ్లీ వానలు కురవకపోవడంతో సాగు చేసిన పంటలు బెట్టబోతున్నాయి. దీంతో రైతులు వానల రాకపై దిగాలు చెందుతున్నారు.

పరిహారం డబ్బులు చెల్లించాలి



గత ఏడాది రబీ సీజన్‌లో వానలు కురవక 10 ఎకరాల్లో సాగు చేసిన శనగ పంట నష్టపోయా. పంటలకు పరిహారం చెల్లిస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు పైసా నష్టపరిహారాన్ని కూడా మంజూరు చేయలేదు. జగనన్న ఏటా ఇచ్చే రైతు భరోసా డబ్బులను కూడా ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఇవ్వకుండా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తోంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పరిహారం డబ్బులను చెల్లించడంతో పాటు, పెట్టుబడి సాయంగా ఇచ్చే డబ్బులను కూడా చెల్లిస్తే బాగుంటుంది. –శివ, రైతు, వెంకటగిరి, కోడుమూరు

రైతులను ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి రైతులకు ఎలాంటి సాయాన్ని అందించలేదు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోతే కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకుందే తప్ప ఇంత వరకు పైసా పరిహారాన్ని అందించలేదు. అలాగే ఎన్నికల హామీ భాగంగా అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20వేలు ఇస్తామని చెప్పి మొదటి ఏడాది ఇవ్వకుండా రైతులను మోసం చేసింది. ఈ ఏడాది ఖరీఫ్ ముందు చెల్లిస్తామని చెప్పి ఇప్పటి వరకు లబ్ధిదారుల జాబితా ఎంపిక పేరుతో కాలయాపన చేస్తోంది. ఇకనైనా ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి. –మహేశ్వర్‌రెడ్డి, రైతు, చనుగొండ్ల గ్రామం, గూడూరు